## గాంధీ జయంతి రోజున హామీ ఇచ్చి విస్మరించారు

**ఏప్రిల్ 24 న ఛలో హైదరాబాద్**

**జీవో 317 బాధిత ఉద్యోగ, ఉపాధ్యాయ జేఏసీ**

ఖైరతాబాద్, మార్చి 22 : జీవో నం.317 ద్వారా స్థానికత కోల్పోయిన వారికి న్యాయం చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చి విస్మరించారని జీవో 317 బాధిత ఉద్యోగ, ఉపాధ్యాయ జేఏసీ చైర్మన్ టి.విజయ్ కుమార్ అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు నాడు పీసీసీ అధ్యక్షుడి హోదాలో రేవంత్‌రెడ్డి 2023 అక్టోబర్ 2 గాంధీ జయంతి రోజున గాంధీ భవన్ సాక్షిగా అధికారంలోకి వచ్చిన 48 గంటల్లో సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని , కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ఈ అంశాన్ని పొందుపర్చారని గుర్తు చేశారు. ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలంటూ గతేడాది అక్టోబర్ 2న గాంధీ భవన్ వద్ద ధర్నా చేస్తే స్వయంగా ప్రస్తుత పీసీసీ అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌లు గాంధీ జయంతి రోజు తాము అబద్దాలు చెప్పము అంటూ ప్రకటించారని, కాని నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు హామీని నిలబెట్టుకోలేదన్నారు. ముగ్గురు మంత్రులతో 2024 ఫిబ్రవరి 24న వేసిన సభ కమిటీ రిపోర్టును గత ఏడాది అక్టోబర్ 20న ముఖ్యమంత్రికి పంపారని కాని ఇప్పటికీ రిపోర్టును బయటపెట్టలేదన్నారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి చర్యలు లేకపోవడంతో ఇటీవల మంచిర్యాలకు చెందిన ఓ ఉపాధ్యాయుడు ఆత్మహత్యకు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. గాంధీ జయంతి రోజు ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించడం సిగ్గుచేటన్నారు. ఏప్రిల్ 14న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి లోగా తమ సమస్య పరిష్కరించకుంటే 24న ఛలో హైదరాబాద్ కార్యక్రమాన్ని చేపడుతామని హెచ్చరించారు. అనంతరం ఛలో హైదరాబాద్ పోస్టర్లను జేఏసీ సెక్రటరీ జనరల్ నాగేశ్వర్ రావు, కార్యదర్శి పి. సందీప్, కోశాధికారి ఎం.వినోదతో కలిసి ఆవిష్కరించారు.



ఎర్త్ అవర్ డే సందర్భంగా చీకట్లో సచివాలయం

## గ్రేటర్‌కు రాగల 24 గంటల్లో వర్ష సూచన

సిటీబ్యూరో, మార్చి 22 (నమస్తే తెలంగాణ): బంగాళాఖాతంలో ఏర్పడిన ద్రోణి ప్రభావంతో రాగల 24 గంటల్లో గ్రేటర్‌లోని పలు చోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వానలు కురిసే అవకాశం ఉన్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. కాగా మొన్నటి వరకు ఎండలతో వేడెక్కిన నగర వాతావరణం ద్రోణి ప్రభావంతో కొంత చల్లబడింది. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ట ఉష్ణోగ్రతలు 34.6 డిగ్రీలు, కనిష్ట ఉష్ణోగ్రతలు 19.1 డిగ్రీలు, గాలిలో తేమ 48 శాతంగా నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు.

# ఢిల్లీ సాకులు వద్దు..

**రేవంత్ రెడ్డి నీకు చిత్తశుద్ధి ఉంటే..**

**జీవోలు జారీ చేసి రిజర్వేషన్లను అమలు చేయి**

**రౌండ్ టేబుల్ సమావేశంలో బీసీ జన సభ అధ్యక్షులు రాజారాం యాదవ్**




సమావేశంలో అభివాదం చేస్తున్న రాజారాం యాదవ్, ఆర్. కృష్ణయ్య, నారగోని

ఖైరతాబాద్, మార్చి 22: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ సర్కారు ఢిల్లీ సాకులు చెప్పి రిజర్వేషన్ల అమలును పక్కన పెట్టాలని చూస్తోందని ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే జీవోలు జారీ చేసి రిజర్వేషన్లను అమలు చేయాలని వక్తలు అభిప్రాయం వ్యక్తం చేశారు. బీసీ జనసభ ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో 'బీసీ బిల్లు- స్థానిక సంస్థలు, విద్య, ఉద్యోగ రంగాల్లో తక్షణమే రిజర్వేషన్ల అమలు కోసం ఉద్యమ కార్యాచరణ' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. బీసీ జన సభ రాష్ట్ర అధ్యక్షులు డి.రాజారాం యాదవ్ మాట్లాడుతూ రిజర్వేషన్లు అమలు చేసే బాధ్యత నుంచి తప్పించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ పాట పాడుతున్నారని ఆరోపించారు. స్థానిక సంస్థలతో పాటు విద్యా, ఉద్యోగ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసేంత వరకు కాంగ్రెస్ పార్టీపై రాజీలేని పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బీసీ అంశాన్ని ఢిల్లీ వైపు మళ్లించడానికి డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతుందన్నారు. అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన సమగ్రకులగణన శాస్త్రీయమైందని అభిప్రాయపడ్డారు. గిరిజన శక్తి రాష్ట్ర అధ్యక్షులు బి. సంజీవ్ నాయక్ మాట్లాడుతూ బీసీల రాజ్యాధికారం వచ్చినప్పుడు అందరి బతుకులు మారుతాయన్నారు. హిందూ బీసీ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు బత్తుల సిద్దేశ్వర్ పటేల్ మాట్లాడుతూ కులగణన ఆధారంగా రిజర్వేషన్లు అమలు చేయకుంటే ఆమరణ దీక్షకు దిగుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో హైకోర్టు సీనియర్ న్యాయవాది డాక్టర్ కదిరె కృష్ణ, విద్యావేత్త అశోక్, ఎంబీసీ కులాల జాతీయ కన్వీనర్ కొండూరి సత్యనారాయణ, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు అల్లంపల్లి రాంకోటి, పద్మశాలి సంఘం నాయకులు శ్రీనివాస్ నేత, తెలంగాణ జర్నలిస్టు ఫోరం రాష్ట్ర ప్రధానకార్యదర్శి మేకల కృష్ణ, బీసీ డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ కర్నాటి శ్రీనివాస్, అంబేద్కర్ ఆజాది సంఘం రాష్ట్ర అధ్యక్షులు కొంగర నరహరి తదితరులు పాల్గొన్నారు.

# రేషన్ కార్డులెప్పుడిస్తరు?

**విచారణ పేరిట అధికారులు జాప్యం**

**రేషన్ కార్డుల కోసం దరఖాస్తుదారుల ఇక్కట్లు**



మేడ్చల్, మార్చి 22 (నమస్తే తెలంగాణ) : రేషన్ కార్డుల జారీలో విచారణ పేరిట జాప్యం చేస్తున్నట్లు దరఖాస్తుదారుల నుంచి ఆరోపణలు వినిపిస్తున్నాయి. రేషన్ కార్డుల కోసం దరఖాస్తుదారులు ఎదురుచూపులు తప్పడం లేదు. జనవరి 26 న ఆరు పథకాల ప్రారంభంలో భాగంగా మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 6,800 మందికి మాత్రమే రేషన్ కార్డులను జారీ చేసిన విషయం విధితమే. ఆనాటి నుంచి ఇప్పటి వరకు రేషన్ కార్డుల జారీకి లబ్ధిదారుల ఎంపికపై విచారణ జరుగుతుందని విచారణ అనంతరం రేషన్ కార్డులు జారీ చేస్తామని చెప్పడం చూస్తుంటే కావాలనే రేషన్ కార్డుల జారీలో కాలయాపన చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. రేషన్ కార్డుల కోసం దరఖాస్తుదారులు ప్రజాప్రతినిధుల, అధికారులు చుట్టూ తిరుగుతున్నా కార్డుల జారీపై సరైన సమాధానం చెప్పడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### వివిధ పథకాలకు రేషన్ కార్డులే ప్రమాణికం

వివిధ పథకాలకు రేషన్ కార్డులే ప్రమాణిక కావడంతో రేషన్ కార్డుల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. నిరుపేదలకు రేషన్ కార్డులు లేకపోవడంతో ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత వైద్య సేవలను పొందలేకపోతున్నారు. వివిధ ప్రభుత్వ పథకాలకు రేషన్ కార్డులను ముడి పెట్టడంతో కార్డులు లేని వారు అయోమయానికి గురవుతున్నారు. ఇండ్ల మంజూరు, పెన్షన్లు, తదితర పథకాలకు రేషన్‌కార్డులను ప్రమాణికంగా తీసుకోవడం మూలంగా కార్డులు లేని వారు ఇబ్బందులకు పడుతున్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా లక్షా 22 వేల దరఖాస్తులు రేషన్ కార్డుల కోసం రాగా ఇప్పటి వరకు 6 వేలా 8 వందల మందికి మాత్రమే కార్డులను జారీ చేశారు. అయితే జీహెచ్ఎంసీ పరిధిలోని నియోజకవర్గాలలో ఇప్పటి వరకు రేషన్ కార్డుల జారీ జరగలేదు. విచారణ ఎప్పుడు పూర్తి చేస్తారు రేషన్ కార్డులను ఎప్పుడు జారీ చేస్తారో తెలియని పరిస్థితి ఉందని ఆందోళన చెందుతున్నారు. రేషన్ కార్డుల జారీ నిరంతరం పక్రియగా కొనసాగిస్తామని చెప్తున్నా ప్రభుత్వం చేసిన దరఖాస్తులకే కార్డులు అందించడం లేదని త్రీవ నిరాశకు గురవుతున్నారు.

## రోడ్డు విస్తరణతో వేలాది కుటుంబాలు రోడ్డు పాలు

**రోడ్డు విస్తరణను కుదించాలి**

**కలెక్టర్‌కు రాజీవ్ రహదారి ప్రాపర్టీస్ ఓనర్స్ జేఏసీ చైర్మన్ వినతి**



హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దూరిశెట్టి కి వినతిపత్రం ఇస్తున్న రాజీవ్ రహదారి ప్రాపర్టీస్ ఓనర్స్ జేఏసీ చైర్మన్ సతీష్ గుప్త, సభ్యులు

మారేడ్‌పల్లి, మార్చి 22 రాజీవ్ రహదారి విస్తరణలో భాగంగా 200 ఫీట్ల నుంచి 100 ఫీట్లకు రోడ్డును కుదించాలని హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దూరిశెట్టిని శనివారం కార్యాలయంలో రాజీవ్ రహదారి ప్రాపర్టీస్ ఓనర్స్ జేఏసీ చైర్మన్ తేలుకుంట సతీష్ గుప్త సభ్యులు కలిసి వినతిపత్రం అందజేశారు. రెండు వందల ఫీట్ల రోడ్డు విస్తరణతో వేలాది కుటుంబాలు రోడ్డు పడే పరిస్థితి నెలకొందని,100 ఫీట్లకు కుదిస్తే బాగుంటుందని కలెక్టర్‌కు వివరించారు. ఇప్పటికే రోడ్డు విస్తరణలో భాగంగా చాలా మంది కిరాయిదారులను, వ్యాపార సముదాయాలను ఖాళీ చేయించడం జరిగిందని తెలిపారు. ముఖ్యంగా ఇంటి పన్ను పెంచడం చాలా బాధాకరని, పెంచిన పన్నులను వెంటనే తగ్గించాలని, రోడ్డు విస్తరణ పూర్తి అయ్యే వరకు ఇంటి పన్నులను వసూళ్లు చేయొద్దని కలెక్టర్‌ను కోరామని చైర్మన్ సతీష్ గుప్త తెలిపారు. అంతే కాకుండా విద్యుత్ అధికారులు ప్రతి ఒక్క భవనానికి ట్రాన్స్‌ఫార్మర్ పెట్టుకోవాలని ఒత్తిడి చేస్తున్నారని కలెక్టర్‌కు వివరించారు. త్వరలో రోడ్డు విస్తరణ విషయం సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తానని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. ఇంటి పన్ను, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల విషయంలో తక్షణమే అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని కలెక్టర్ తెలిపినట్లు జేఏసీ చైర్మన్ సతీష్ గుప్త వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఉప్పలంచ అమర్‌నాథ్, సూర్యప్రకాశ్‌రెడ్డి, మినిగాండ్ల శ్రీనివాస్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## సుబ్రహ్మణ్యంకు సర్వీస్ అబోవ్ సెల్ఫ్ అవార్డు

సిటీబ్యూరో, మార్చి 22 (నమస్తే తెలంగాణ) : రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్ అనస్థీషియన్ వైద్యనిపుణులు డాక్టర్ సుబ్రహ్మణ్యం ప్రతిష్టాత్మకమైన 'సర్వీస్ అబోవ్ సెల్ఫ్' అవార్డును దక్కించుకున్నారు. పాలియేటివ్ కేర్ రంగంలో అవిశ్రాంత కృషికి గుర్తింపుగా రోటరీ ఇంటర్నేషనల్ క్లబ్ ఈ అవార్డును ప్రకటించింది. ఈ మేరకు శనివారం నగరంలోని ఎస్ఎన్ఆర్ పుష్ప కన్వెన్షన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా డా.మద్దిరాల సుబ్రహ్మణ్యం 'సర్వీస్ అబో సెల్ఫ్' అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ఎంపిక చేసిన 150 మందిలో నగరానికి చెందిన డా.సుబ్రహ్మణ్యంకు ఈ పురస్కారం దక్కడం ఆయనకే కాకుండా నగరానికి కూడా గర్వకారణమన్నారు.



## మల్లారెడ్డి విద్యార్థిని మైక్రోసాఫ్ట్ ఇంటర్న్‌షిప్‌కు ఎంపిక



కీర్తిని సన్మానిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డి

మేడ్చల్, మార్చి 22: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల మెయిన్ క్యాంపస్‌కు చెందిన విద్యార్థిని కీర్తి మైక్రోసాఫ్ట్‌లో ఇంటర్న్‌షిప్‌కు ఎంపికైయిింది. బీటెక్ (ఐటీ) తృతీయ సంవత్సరం చదువుతుంది. ఆన్‌లైన్‌లో మైక్రోసాఫ్ట్ కంపెనీ నిర్వహించిన పరీక్షను పూర్తి చేసి ఇంటర్న్‌షిప్‌ను సొంతం చేసుకుంది. ఐఐటీ, నిట్‌ల తర్వాత రాష్ట్రంలో స్వయంప్రతిపత్తి కల్గిన కళాశాలల నుంచి ఇద్దరిని మాత్రమే ఎంపిక చేశారు. అందులో కీర్తి ఉంది. కీర్తి ఇంటర్న్‌షిప్‌కు ఎంపికైన సందర్భంగా కళాశాల వ్యవస్థాపక చైర్మన్, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామస్వామిరెడ్డి, ఐటీ విభాగం అధిపతి వసంత్ కుమార్ ప్రత్యేకంగా అభినందించారు.

## బీసీ బిల్లును పార్లమెంట్ ఆమోదించే వరకు ఉద్యమం




విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఓబీసీ లాయర్స్ జేఏసీ నేతలు

రవీంద్రభారతి, మార్చి 22 : బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం శాసనసభలో ప్రవేశపెట్టిన 42 శాతం బిల్లును ఏకగ్రీవంగా ఆమోదించి అందుకు సహకరించిన అన్ని రాజకీయ పక్షాలకు లాయర్స్ ఓబీసీ లాయర్స్ జేఏసీ అభినందనలు తెలుపుతుందన్నారు. ఈ మేరకు బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఓబీసీ లాయర్స్ జేఏసీ చైర్మన్ తలకొక్కుల రాజు, కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ చైర్మన్ పొన్నం అశోక్‌గౌడ్, ఓబీసీ డిమోక్రటిక్ జేఏసీ కన్వీనర్ కోల జనార్ధన్, ఎఎల్‌పీఏ స్టేట్ ప్రెసిడెంట్ పొన్నం దేవరాజ్‌గౌడ్ , పూస మల్లేషం, టి.రాహుల్ వంశీకృష్ణ, లాయర్ జాక్ కనీనర్స్ కొండూరి వినోద్‌కుమార్ తదితరులు ప్రసంగించారు. విద్యా,ఉద్యోగ రాజకీయ రంగాలలో బీసీ రిజర్వేషన్లు పెంచుతూ ప్రవేశపెట్టిన బిల్లును ఆమోదించినందుకు ఓబీసీ లాయర్స్ జేఏసీ అన్ని పార్టీలకు కృతజ్ఞతలు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కూడా త్రికరణశుద్ధితో పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టి రాష్ట్రపతి చేత ఆమోదం పొందే వరకు ఉద్యమం కొనసాగిస్తామన్నారు. లేని పక్షంలో ఓబీసీ లాయర్స్ జేఏసీ మిగతా ఓబీసీ సంఘాలతో కలిసి ఐక్య కార్యాచరణతో ఉద్యమిస్తామని వారు స్పష్టం చేశారు.

## గ్రామీణాభివృద్ధిలో నాబార్డ్ పాత్ర కీలకం



సిటీ బ్యూరో, మార్చి 22 (నమస్తే తెలంగాణ) : దేశంలోని గ్రామాల అభివృద్ధిలో నాబార్డు కీలక పాత్ర పోషిస్తుందని పతంజలి అధినేత ఆచార బాలకృష్ణ అన్నారు. పతంజలి రీసెర్చ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఒకరోజు నాబార్డ్ సందర్శన కార్యక్రమాన్ని ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్‌లో శనివారం నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో నాబార్డు సహకారంతో జరిగిన అభివృద్ధి కార్యక్రమాల గురించి తెలుసుకోవడమే ఉద్దేశంగా ఈ కార్యక్రమం జరిగింది. నాబార్డు ఆధ్వర్యంలో కేంద్రం చేపట్టిన పథకాలను పతంజలి ప్రతినిధులకు వివరించారు.

## కేఎల్‌హెచ్ బాచుపల్లి క్యాంపస్‌లో కళా ఉత్సవ్




సిటీ బ్యూరో, మార్చి 22 (నమస్తే తెలంగాణ): బాచుపల్లిలోని కేఎల్‌హెచ్ క్యాంపస్‌లో కళా ఉత్సవ్-2025 శనివారం ఘనంగా నిర్వహించారు. భారతీయ సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుకునేందుకు, యువత ప్రతిభను ప్రోత్సహించేందుకు కేఎల్‌హెచ్ స్టూడెంట్ యాక్టివిటీ సెంటర్, తెలంగాణ ప్రభుత్వ భాషా, సాంస్కృతిక శాఖ సంయుక్తంగా ఈ జాతీయ స్థాయి వేడుకను నిర్వహించింది. దేశ వ్యాప్తంగా కళాకారులు, రచయితలు, ఫొటో గ్రాఫర్లు, సినీ నటులు పాల్గొన్నారు. కార్యక్రమంలో యూపీ నీటిపారుదల శాఖ కార్యదర్శి నవీన్ కుమార్, సినీనటుడు ప్రదీప్ కౌశిక్, సీడ్స్ ఫామ్ వ్యవస్థాపకుడు కిషోర్ ఇందుకూరి, సాక్ డైరెక్టర్ సాయి విజయ్, ప్రిన్సిపాల్స్ కోటేశ్వరరావు, రామకృష్ణ ఆకెళ్ల, కన్వీనర్ ప్రేమ సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## హిమానీ పర్వతాలను కాపాడుకుందాం

**ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ పూర్వ డైరెక్టర్ పీజీ శాస్త్రి**



సిటీ బ్యూరో, మార్చి 22, (నమస్తే తెలంగాణ) : వాతావరణ మార్పులు, కాలుష్యం వల్ల కరిగిపోతున్న హిమానీ పర్వతాలను కాపాడుకోవాలని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ పూర్వ డైరెక్టర్ పీజీ శాస్త్రి పిలుపునిచ్చారు. శనివారం ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రపంచంలోనే చైనా, అమెరికా తర్వాత ఇండియాలో 2800 ప్రాజెక్టులుండగా ఈ నీరు మన దేశ ప్రజలకు సరిపోవడం లేదన్నారు. భూగర్భ జలాలను అధికంగా వాడటం వల్ల హైదరాబాద్‌లో ట్యాంకర్లతో నీళ్లు కొనుకుంటున్నామని గుర్తు చేశారు. కృష్ణా రివర్ యాజమాన్య బోర్డు పూర్వ చైర్మన్ ఏ. పరమేశం మాట్లాడుతూ కృష్ణా నది జలాల్లో కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, తెలంగాణ, మహారాష్ట్రలకు వాటాలున్నందువల్ల ఏ రాష్ట్రానికి తగినన్ని నీళ్లు రావడం లేదన్నారు. అనంతరం రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్ జంబుల్ రెడ్డి మాట్లాడుతూ షాద్ నగర్ ప్రాంతంలో కొత్త ప్రాజెక్టు ఒకటి నిర్మిస్తే హైదరాబాద్‌కు గ్రావిటీ ద్వారా నీళ్లు అందించవచ్చన్నారు. ఈ సమావేశంలో ఇనిస్టిట్యూట్ ఆఫ్‌పబ్లిక్ ఎంటర్ ప్రైజెస్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ అనుపమ మొహంతి, ఎం. రాజశేఖర్ రెడ్డి, జి. నరేష్, ఎస్ఏ. కవిత విద్యార్థులు పాల్గొన్నారు.

# వారానికోసారి మంచినీళ్లు!

(మొదటిపేజీ తరువాయి)

ప్రస్తుతం ఉన్న వాటికంటే ట్యాంకర్లను పెంచడంతో పాటు అదనపు ఫిల్లింగ్ కేంద్రాలకు కూడా రంగం సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది. కాగా, పలుచోట్ల జలమండలి సిబ్బంది దీపం ఉండగానే అన్నట్లుగా ట్యాంకర్లను పక్కదారి పట్టించి భారీ ఎత్తున సొమ్ము చేసుకుంటున్నారు. దీంతో వినియోగదారులకు రెండు, మూడు రోజులకైనా దక్కాల్సిన ట్యాంకర్ నీళ్లు ఐదారు రోజులు కొన్ని ప్రాంతాల్లో వారం, పది రోజులకుగానీ అందడం లేదు.

**సరఫరా వ్యవస్థపై పెరుగుతున్న భారం**

భూగర్భజలాలు అడుగంటుతుండటంతో జలమండలి నీటి సరఫరా వ్యవస్థపై భారం మరింతగా పెరుగుతున్నది. ఈ క్రమంలో ట్యాంకర్లకు డిమాండు రెట్టింపు కంటే ఎక్కువ కావడం, అటువైపు నీటిని మళ్లించడంతో గృహాలకు జరిగే నీటి సరఫరాలో పరిమాణం సన్నగిల్లుతున్నది. ఈ క్రమంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఏకంగా వారం రోజులకోసారి జలమండలి నీటిసరఫరా జరగడంలేదంటే పరిస్థితి ఎంత విషమంగా మారుతుందో అర్థం చేసుకోవచ్చు. వాస్తవానికి ఉమ్మడి రాష్ట్రంలో ఈ ప్రాంతాలు శివారు మున్సిపాలిటీలుగా ఉన్నప్పుడు వారం, పదిరోజులకోసారి మంచినీటి సరఫరా జరిగేది. కానీ కేసీఆర్ ప్రభుత్వ హయాంలో వేసవి కాలంలోనూ ఈ ప్రాంతంలో రోజు విడిచి రోజు నీటి సరఫరా జరిగేది. కాగా, కూకట్‌పల్లి, మల్కాజిగిరి, ఉప్పల్, ఎల్బీనగర్, రాజేంద్రనగర్ నియోజకవర్గాల పరిధిలోనూ జలమండలి సరఫరా నీటి సరఫరాలో లోప్రెషర్‌తో జనం అవస్థలు పడుతూనే ఉన్నారు.

**గుబులుపుట్టిస్తున్న నాగార్జునసాగర్..**

హైదరాబాద్ తాగునీటి సరఫరాలో ఏకంగా 48-50 శాతం పరిమాణాన్ని సరఫరా చేసే నాగార్జునసాగర్ నీటిమట్టం గుబులు పుట్టించే స్థాయిలోకి వెళ్లిపోతున్నది. నాలుగైదు రోజులుగా శ్రీశైలం జలాశయం నుంచి విద్యుత్ ఉత్పత్తి ద్వారా సాగర్‌కు 20-30వేల క్యూసెక్కుల వరకు ఇన్‌ఫ్లో వస్తున్నది. దీంతో సాగర్ నుంచి రోజుకు రెండు టీఎంసీల వరకు ఏపీ, తెలంగాణ డ్రా చేస్తున్నా నీటి మట్టం 519 స్థాయిలో కొనసాగుతున్నది. శ్రీశైలంలో మరో ఐదు టీఎంసీలు ఖాళీ అయితే పవర్ హౌస్‌ల నుంచి విద్యుత్ ఉత్పత్తికి అవకాశం ఉండదు. అంటే సాగర్‌లో మరో రెండు రోజులు నీటిమట్టం స్థిరంగా ఉండే సూచనలున్నాయి. కాగా తెలంగాణ, ఏపీ సాగునీటి అవసరాలు భారీగానే ఉన్నా సర్దుబాటుకు సిద్ధమైనా ఏప్రిల్ చివరి నాటికి కనిష్ఠంగా 50 టీఎంసీల వరకు తీసుకుంటేనే పంటలు గట్టెక్కుతాయి. ఆస్థాయిలో నీళ్లు ఖాళీ అయితే సాగర్ నిల్వ ప్రస్తుతం ఉన్న 148 టీఎంసీల నుంచి వందలోపునకు పడిపోతుంది. తీవ్ర దుర్భిక్ష సమయాల్లోనూ సాగర్‌లో నీటి నిల్వ ఈ స్థాయిలో పడిపోయిన దాఖలాలు లేవు. దీంతో ఇటు సాగుకు కోత పెట్టి తాగునీటిని గట్టెక్కించాలా? లేదా పంటలను కాపాడి తాగునీటి గండానికి సిద్ధపడాలా? అనే క్లిష్టమైన సవాల్ ముందున్నది. తాగునీటి కోసం గోసపడుతున్నాం.

## పల్లె రవికి మధుసూదనాచారి పరామర్శ



పల్లె రవికుమార్‌తో మాట్లాడుతున్న మధుసూదనాచారి, నాయకులు

సిటీ బ్యూరో, మార్చి 22 (నమస్తే తెలంగాణ): తెలంగాణ కల్లు గీత కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్‌ను శాసన మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న పరామర్శించారు. సరూర్ నగర్ లోని ఆయన ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితి తెలుసుకుని త్వరగా కోలుకుని ప్రజాసేవలో ఉండాలని కాంక్షించారు. రవి కుమార్‌కు ఇటీవల కాలుకు గాయమై చికిత్స అనంతరం విశ్రాంతి తీసుకుం టున్నారు. రవి కుమార్‌ను పరామర్శించిన వారిలో విశ్వబ్రాహ్మణ సంఘం నేత బాలబ్రహ్మచారి, యాదవ మహాసభ యాదాద్రి జిల్లా అధ్యక్షుడు కన్నెబోయిన అయోధ్య యాదవ్, బీఆర్ఎస్ నాయకులు బడేటి సత్యనారాయణ గౌడ్, నీళ్ల లింగస్వామి గౌడ్, బీసీ సంఘం యాదాద్రి జిల్లా ఉపాధ్యక్షుడు సోము రమేష్ యాదవ్, యువజన నాయకుడు వర్కాల అంబేద్కర్ తదితరులు ఉన్నారు.

## ఎనిమిది అంశాలకు ఆమోదం

**మేయర్ గద్వాల విజయలక్ష్మి**

సిటీ బ్యూరో, మార్చి 22(నమస్తే తెలంగాణ) : అల్వాల్ గ్రామ కంఠంలోని పదకొండు గుంటల భూమిని మేడ్చల్ డివిజన్ అగ్నిమాపక కేంద్రం నిర్మాణానికి కార్పొరేషన్ ఎన్ఓసీ జారీచేయడానికి జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ ఆమోదించింది. దీంతో సహా ఎనిమిది కీలక అంశాలకు ఆమోదం తెలిపినట్లు మేయర్ గద్వాల విజయలక్ష్మి తెలిపారు. మేయర్ అధ్యక్షతన శనివారం జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జీహెచ్ఎంసీ పరిధిలో పలు రకాల పనులు చేపట్టేందుకు నిర్ణయించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ స్టాండింగ్ కమిటీ నిర్మాణాత్మక, ప్రజా ఉపయోగ నిర్ణయాలు తీసుకుని నగర అభివృద్ధికి కలిసి కట్టుగా పనిచేయాలని సభ్యులకు సూచించారు. ఈ సమావేశంలో స్టాండింగ్ కమిటీ సభ్యులు బొంతు శ్రీదేవి, బానోతు సుజాత, సయ్యద్ మిన్హాజుద్దీన్, సమీనా బేగం, అబ్దుల్ వాహెబ్, మహాలక్ష్మి రమన్ గౌడ్, మహమ్మద్ గౌస్ ఉద్దీన్, సీఎన్‌రెడ్డి, వీ జగదీశ్వర్ గౌడ్, బురుగడ్డ పుష్ప నగేష్ పాల్గొన్నారు.